నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
17వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా

ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనది

- ఉభయ గోదావరి జిల్లాల గ్యాడ్యూయేట్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

అంబాజీపేట, మేజర్ న్యూస్ : ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనదని, విధి నిర్వహణలో విద్యార్థుల పట్ల అంకిత భావంతో పని చేసేవారికి ఎల్లవేళలా గుర్తింపు ఉంటుందని ఉభయ గోదావరి జిల్లాల గ్యాడ్యూయేట్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. గంగలకుర్రు అగ్రహారం జెడ్పీ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తూ అనెల 30న ఉద్యోగ విరమణ చేస్తున్న ఖండవిల్లి శ్రీనివాస్ సన్మాన సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచలో ఎంతో మందిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనదని ఉన్నారు.అనంతరం ఉద్యోగ విరమణ చేస్తున్న శ్రీనివాస్‌ను, ఈ ఏడాది మే నెలలో ఉద్యోగ విరమణ చేసిన మ్యాథ్స్ ఉపాధ్యాయుడు వేమూరి రూబేనులను పాఠశాల సిబ్బంది, స్థానికులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని, సీఎంఓ బొరుసు వి.వి.సుబ్రహ్మణ్యం, ఎంఈఓ 1, 2లు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, కనకదుర్గ, ఉప సర్పంచ్ బంధన రాంబాబు, విత్తనాల ఇంద్రశేఖర్, ఎం.ఎం.శెట్టి, యూటీఎఫ్, ఎస్టీయు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బియ్యం రీసైక్లింగ్‌పై

సిఐడి విచారణ

- కాకినాడ పోర్ట్ గోదాముల తనిఖీల అనంతరం మంత్రి నాదెండ్ల

కాకినాడ,మేజర్‌న్యూస్ : కాకినాడ పోర్ట్ కేంద్రంగా సాగిన రీసైక్లింగ్ బియ్యం ఎగుమతుల కార్యకలాపాలపై సీఐడీ విచారణకు అప్పగిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం ఆయన పౌరసరఫరాలు, రెవిన్యూ, లీగల్ మెట్రాలజీ తదితర శాఖల అధికారులతో కలిసి బియ్యంగోదాములనుతనిఖీలు నిర్వహించారు. కాకినాడ పట్టణం పోర్టు ఏరియాలో ఉన్న అశోక ఇంటర్నేషనల్, హెచ్ఒన్ బియ్యం గోదాములను,లాంగర్ రేవుయాంకరేజ్ పోర్టులో ఎగుమతి అవుతున్నబియ్యాన్నితనిఖీ చేశారు. ఈసందర్భంగా రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ కాకినాడజిల్లాపర్యటనలో భాగంగా తొలిరోజు నిర్వహించిన తనిఖీల్లో 7,615 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేశామన్నారు. లావన్ ఇంటర్నేషనల్, అయ్యప్ప ఎక్స్‌పోర్ట్, విశ్వ ప్రియా, సార్టెక్స్ ఇండియా, సరళాఫుడ్స్, వి.ఎస్.రాజు సన్స్ గోదాముల్లో పీడీఎస్ బియ్యానికి సంబంధించినస్పష్టమైనఆధారాలు దొరకాయన్నారు. రెండోరోజు తనిఖీలలో భాగంగా కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి పేదవాడికి అందాల్సిన బియ్యాన్ని వారి పొట్ట కొట్టి అక్రమంగా ఆఫ్రికన్ దేశాలకు తరలిస్తూ భారీ అవినితికి పాల్పడ్డతున్నారన్నారు. ఇంతవరకు కాకినాడ యాంకరేజ్ పోర్టు గురించి దినపత్రికల్లో అనేక కథనాలు చదవడంతో తెలుసుకున్నానని, నేడుతొలిసారిగా,స్వయంగా యాంకరేజ్ పోర్టులో జరుగుతున్న కార్యకలాపాలను చూసి చాలా ఆశ్చర్యానికి లోనయ్యానని మంత్రి తెలిపారు. ఈరోజు నిర్వహించిన తనిఖీల్లో అశోక గోదాములో 2,800 మెట్రిక్ టన్నులు, హెచ్ఒన్ గోదాములో 2,500 మెట్రిక్ టన్నులు మొత్తం 5,800 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని, స్టాక్ రిజిష్టర్లను సీజ్ చేశామన్నారు.ఇంకాలోతుగా తనిఖీలు చేసేందుకు రాష్ట్ర పౌరసరఫరాలఎండీ, జాయింట్ కలెక్టర్‌తో కూడినప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన గోదాములను తనిఖీ చేసి, రాష్ట్ర ప్రభుత్వం నుంచి పంపిణీ చేసే పీడిఎస్ బియ్యాన్ని అక్రమంగారీసైక్లింగ్ చేస్తున్నవారిపై చర్య తీసుకుంటామన్నారు.

పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నష్టం వాటిల్లేలా చేయడంతోపాటు వినియోగదారునికి, రైతుకు అన్యాయం చేస్తున్నారన్నారు.రేషన్ కార్డుదారులకు అందించే సరుకులను నూటికి నూరుశాతం పారదర్శకంగా, నిజాయితీగా అందేలావ్యవస్థలోమార్పు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ వ్యవస్థను ప్రక్షాళన చేయడంఇక్కడ నుంచే ప్రారంభించామన్నారు. యాంకరేజ్‌పోర్టులో జరుగుతున్న కార్యకలాపాలపై పోర్టు అధికారులు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఈ పర్యటనలో చాలావరకు అవగాహన చేసుకున్నానని, మరో దఫా యాంకరేజ్ పోర్టును సందర్శించి, పూర్తి ప్రక్షాళనకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ అంశాలపై సమగ్రమైన రిపోర్ట్ సిద్ధం చేసి, సీఐడీకి అందించడం జరుగుతుందన్నారు. ప్రజలుఆశించిన విధంగాపరిపాలన అందించేందు కు ముందుకుఅడుగులువేయడం జరుగుతుందని మంత్రినాదెండ్ల మనోహర్‌తెలిపారు.

పర్యటనలో మంత్రివెంటలీగల్‌మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ డి.రామ్ కుమార్, పి.సుధాకర్, జిల్లా లీగల్ మెట్రాలజీ డీప్యూటి కంట్రోలర్ ఎన్.జనర్ధనరావు, పౌరసరఫరాల సంస్థ డీఎం బి.బాలసరస్వతి, డీఎస్పో ఎం.వి.ప్రసాద్, కాకినాడ పట్టణం, కాకినాడరూరల్ తహసీల్దార్లు కె.చెల్లన్నదొర, బి.విజయ ప్రసాద్, సీఎస్డీటీలు,టెక్నాల్ అసిస్టెంట్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జెఎన్టీయుకె విద్యార్థికి గూగుల్ కంపెనీలో అత్యధిక ప్యాకేజీతో కొలువు

- అభినందించిన విసి తదితరులు

కాకినాడ, మేజర్ న్యూస్ : జెఎన్‌టియుకె యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె)లో కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్ (సిఎస్ఈ) విభాగంలో ఎంటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థి బహుళజాతి సంస్థ అయిన గూగుల్ కంపెనీలో అత్యధిక ప్యాకేజీతో కొలువు సాధించినట్లు ఉపకులపతి ప్రొ.జి.వి.ఆర్.ప్రసాదరాజు తెలిపారు. గూగుల్ సంస్థలో సెక్యూరిటీ అనలిస్ట్‌గా కొలువు సాధించిన విద్యార్థికి రూ.67లక్షల వార్షిక వేతనం లభించనుందన్నారు.బహుళజాతి సంస్థలతో యుసిఇకె కళాశాల ఒప్పందాలు చేసుకోవడం ద్వారా సాఫ్ట్‌వేర్ కంపెనీలు అమలు చేస్తున్న అంశాలు, విధి విధానాలపై ముందుగా విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం ద్వారా మంచి ప్లేస్‌మెంట్స్ సాధించడం జరుగుతుందని ఉపకులపతి ప్రొ.జివిఆర్.ప్రసాదరాజు గారు వివరించారు. యుసిఇకెలోని సిఎస్ఈ విభాగంలో ఎంటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న దొండపాటి హేమంత్ కుమార్ గూగుల్ కంపెనీకి రూ.67లక్షల వార్షిక వేతనంతో సెక్యూరిటీ అనలిస్ట్‌గా ఎంపిక కావడం హర్షణీయమన్నారు. క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్‌లో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక సెమినార్లు, శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగపర్చుకునేలా చర్యలు చేపడుతున్న ప్రిన్సిపల్ ప్రొ. ఎం.హెచ్.ఎం.కృష్ణప్రసాద్, సిఎస్ఈ విభాగాధిపతి ప్రొ. ఓ.శ్రీనివాసరావు, ట్రైనింగ్ & ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా.అరవ కరుణలను, ప్లేస్‌మెంట్స్ సాధించిన విద్యార్థి హేమంత్ కుమార్‌ను ఉపకులపతి ప్రత్యేకంగా అభినందించారు.

జెఎన్‌టియుకె విద్యార్థులు బహుళజాతి సంస్థల్లో కొలువులు సాధించేలా అన్ని విధాలా శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రొ.ఎం.హెచ్.ఎం.కృష్ణప్రసాద్ తెలిపారు. విద్యార్థులకు మెరుగైన ప్యాకేజీలతో ప్లేస్‌మెంట్స్ సాధించేలా సిఎస్ఈ విభాగంలో అన్ని సదుపాయాలను కల్పిస్తున్నట్లు విభాగాధిపతి ప్రొ.ఓ.శ్రీనివాసరావు తెలిపారు. యుసిఇకె ట్రైనింగ్ & ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా.అరవ కరుణ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ విధానాలు పూర్తిగా మారిపోయాయని, దానికి అనుగుణంగా విద్యార్థులకు కాంపిటేటివ్ కోడింగ్, ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పై అవగాహన, కోడింగ్ ప్లాట్‌ఫామ్స్, సాఫ్ట్ స్కిల్స్, భావ వ్యక్తీకరణ తదితర అంశాలపై పూర్తిగా అవగాహన కలిగించేలా శిక్షణ అందిస్తున్నామన్నారు.గూగుల్ కంపెనీకి సెక్యూరిటీ అనలిస్ట్‌గా ఎంపికైన దొండపాటి హేమంత్ కుమార్ స్వస్థలం కాకినాడ. హేమంత్ కుమార్ తండ్రి దొండపాటి రాజారావు కాకినాడలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యుపిహెచ్‌సి)లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తుండగా తల్లి దొండపాటి సూర్యకుమారి విశాఖపట్నం ఆర్‌టిసిలో హెల్త్ ఎడ్యుకేషన్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

జి.నవీన్ కుమార్‌కి జెఎన్టీయుకె పిహెచ్‌డి

కాకినాడ, మేజర్ న్యూస్ : నిపుణుల బృందం సిఫార్సు మేరకు జి.నవీన్ కుమార్ సిద్ధాంత వ్యాసం "డిజైన్ అండ్ అనాలిసిస్ ఆఫ్ మల్టిఫుల్ ఇన్‌పుట్ మల్టిఫుల్ అవుట్‌పుట్ (వీ×మీ) ఫ్యాచ్ యాంటెన్నా ఫర్ 5జి సబ్ 6 +ఎఓ అండ్ వైర్‌లెస్ లోకల్ ఏరియా నెట్‌వర్క్ (ఔూూచీ) అప్లికేషన్స్" జెఎన్‌టియుకె అధికారులచే ఆమోద ముద్ర పొందినది. ఈయనకు పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డు ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసిఈ) విభాగంలో లభించినది. జి.నవీన్ కుమార్ తన సిద్ధాంత వ్యాసాన్ని కాకినాడలోని జెఎన్‌టియుకె యూనివర్శిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ. ఏ.ఎం.ప్రసాద్ మరియు నరసారావుపేటలోని తిరుమల ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ. వై.వి.నారాయణ ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

ప్రాంగణ ఎంపికకు కావలిసిన నూతన సాంకేతిక అంశాలపై అవగాహన సదస్సు

అల్లవరం, మేజర్ న్యూస్ : బివిసి ఇంజనీరింగ్ కళాశాలలు ఓడలరేవు, అమలాపురం, రాజమహేంద్రవరంకు చెందిన సుమారు 1200 వందల మంది విద్యార్థినీవిద్యార్థులకు హైదారాబాద్ ప్రధాన కార్యాలయం గల సర్వీస్ నౌ ఆర్గనైజేషన్ వారు అందించే సాంకేతిక శిక్షణపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రోగ్రాం మేనేజర్ జాషువా కాల్విన్ మాట్లడుతూ ఐటి సర్వీసెస్ మేనేజ్‌మెంట్, కస్టమ్ సర్వీస్ మేనేజ్‌మెంట్, హెచ్ఆర్ సర్వీసెస్ డెలివరీ వంటి రంగాలలో శిక్షణనిచ్చి సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించి వారికి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగ సాధనలో కావలిసిన శిక్షణ ఇస్తున్నానని తెలిపారు.
కళాశాల ప్రిన్సిపాల్ డా.చంద్ర మౌళి వి.ఎస్.ఎ. మాట్లడుతూ సర్వీస్ నౌ సంస్థ సాఫ్ట్‌వేర్ రంగంలో విద్యార్థుల పరిజ్ఞానాన్ని పెంపొందించి ప్రాంగణ ఎంపికల్లో వారు విజయం సాధించేలా నూతన సాంకేతిక శిక్షణను అందిస్తుందని, ఈ అవకాశాన్ని ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీవీసీ విద్యాసంస్థల అధినేత బోనం కనకయ్య, ఛైర్మన్ బోనం కృష్ణ సతీష్, కళాశాల ప్రిన్సిపాల్ డా.చంద్ర మౌళి వి.ఎస్.ఎ., హెడ్ (ప్లేస్‌మెంట్స్), డా. బి.పి.ఎన్. మధుకుమార్ మరియు వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు

ముంపు సమస్య నివారణకు చర్యలు తీసుకోండి

- కమిషనర్ జే.వెంకటరావు ఆదేశం

కాకినాడ, మేజర్ న్యూస్ : వర్షం కారణంగా ఏర్పడే ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు పేర్కొన్నారు. స్థానిక శిగల లక్ష్మీనారాయణ నగర్ ప్రాంతంలోని మదర్ థెరిసా విగ్రహం నుంచి ఫౌండేషన్ ఆసుపత్రి మీదుగా చర్చి వరకు ముంపునకు గురైన ప్రాంతాన్ని కమిషనర్ శనివారం సందర్శించారు. శుక్రవారం అర్ధరాత్రి కురిసిన వర్షం కారణంగా ఆ ప్రాంతం నీట మునగడంతోకమిషనర్ అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ముంపు సమస్య ఎదుర్కొనేందుకు తీసుకోవలసిన చర్యలపై ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగానికి చెందిన అధికారులతో చర్చించారు. రహదారులను ఎత్తు చేసేందుకు అవసరమైన అంచనాల రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ లోపుగా అవుట్లెట్లను శుభ్రం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షం కారణంగా ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే పూడికతీత పనులు చాలా వరకు పూర్తయ్యాయని కమిషనర్ చెప్పారు. అలాగే వర్షాలు పడుతున్న నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ప్రజారోగ్య విభాగాన్ని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట కాకినాడ నగరపాలక సంస్థ ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, ఏఈ వై.నాగేశ్వరరావు, శానిటరీ సూపర్వైజర్ రాంబాబు, సచివాలయ ఉద్యోగులు ఆయన వెంట ఉన్నారు.

విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యం

- ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.బాబ్జి
- పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన 60మంది విద్యార్థినీవిద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు
- సత్య చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కాదా వెంకటరమణ రూ.7 లక్షల 20 వేలతో ప్రోత్సాహం
- అభినందించిన పలు రంగాల్లో ప్రముఖులు

కాకినాడ, మేజర్ న్యూస్ : విద్యతోనే సమాజం మార్పు సాధ్యమని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.బాబ్జి అన్నారు. సత్కస్కాన్స్ & డయగ్నోస్టిక్ సెంటర్ 25వ వార్షికోత్సం పురస్కరించుకుని సత్య చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన 60 మంది విద్యార్థినీ విద్యార్థులకు 7 లక్షల 20 వేల రూపాయల స్కాలర్‌షిప్ చెక్కులను కాకినాడ జెఎన్టీయు అలూమిని ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. కార్యక్రమానికి సత్య చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ కాదా వెంకటరమణ అద్యక్షత వహించగా ఎన్.టి.ఆర్. హెల్త్ యూనివర్శిటి వైస్ చాన్సీలర్ డాక్టర్ కె.బాజ్జీ ముఖ్యఅతిథిగాను కె.ఎస్.పి.ఎల్. సి.ఇ.ఒ. మురళీధరన్ విశిష్ట అతిథిగాను ఐ.ఎం.ఎ. స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ జి.ఎస్.మూర్తి, రోటరీ పాస్ట్ గవర్నర్ డాక్టర్ ఎస్.వి.ఎస్.రావు, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ శృతిరెడ్డి, భాష్యం పబ్లిక్ స్కూల్ జోనల్ ఇన్చార్జి గోవిందరాజులు, సత్య స్కాన్ సెంటర్ డైరెక్టర్లు డాక్టర్ కె.విష్ణుమూర్తి, డాక్టర్ పి.లక్ష్మణమూర్తి గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు డాక్టర్ కె.బాజ్జీ, మురళీధరన్, డాక్టర్ ఎస్.వి.ఎస్.రావు లు మాట్లాడుతూ తను పడ్డ కష్టం ప్రతిభగల ఏ పేద విద్యార్థులకు రాకుడనే ఉదేశ్యంలో సత్య స్కానింగ్ సెంటర్ ఎం.డి డాక్టర్ కాదా వెంకటరమణ చేస్తున్న కృషి ప్రశంసనీయం అన్నారు. 10వ తరగతిలో 510 మార్కులు పైబడి వచ్చిన గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు టెస్టును నిర్వహించి వారిలో 60 మంది ర్యాంకర్లకు 7లక్షల 20 వేల రూపాయల స్కాలర్ షిప్ లను అందించడం అభినందనీయం అన్నారు. డాక్టర్ కాదా వెంకటరమణ మాట్లాడుతూ 60 మంది ర్యాంకర్లు ఇంటర్లోను ఎంసెట్లో వారు సాధించిన ర్యాంకుల బట్టి భవిష్యత్లో వారికి తమ ట్రస్ట్ తరపున ఉన్నత చదువులకు ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్నా విద్యార్థులకు వ్యక్తిత్వవికాశ తరగతులను డాక్టర్ పి.ఎన్.రాజు, డాక్టర్ కాదా వెంకటరమణలు నిర్వహించి వారిలో స్ఫూర్తిని నింపారు. అనంతరం ర్యాంకర్లకు స్కాలర్ షిప్ చెక్కులను పంపిణీ చేసారు.ఈకార్యక్రమంలో డా. విష్ణుమూర్తి, డా. ఆర్.ఎన్.బి. చక్రపాణి, డా. వరప్రసాద్, డా. త్రిమూర్తుల రాయుడు, డా. ఎం.బి.ఆర్.శర్మ, డా. వై.ఎస్.కె.నాత్, డా. యు.రామకృష్ణ, డా. ఉమా, డా.ఎ.సి.హెచ్.రామకృష్ణ,డి.ఎన్.మూర్తి, డి.సుధాకర్, వ్యాపారవేత్త టిక్కు, న్యాయవాధి పేపకాయల రామకృష్ణ, పడాల ట్రస్ట్ ఛైర్మన్ పడాల సూర్యప్రకాశరావు, చుండ్రు జానకిరామ్ ప్రసాద్, కియా జగన్నాధం వారి బృందం, సత్య చారిటబుల్ ట్రస్ట్ అడ్వజర్ అల్లూరి సురేంద్ర, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గోవింద నామస్మరణతో ప్రతిధ్వనించిన వాడపల్లి

- భక్తులతో పోటెత్తిన వెంకన్న ఆలయం

ఆత్రేయపురం, మేజర్‌న్యూస్ : కోనసీమ తిరుమలగా కోరిన కోర్కెలు తీర్చే దైవంగా విరాజిల్లు తున్న వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి ఆలయం భక్తుల గోవింద నామ స్మరణతో ప్రతిధ్వనించింది. ఏడు శనివారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అనే నానుడితో తెలుగు రాష్ట్రాలనుండి వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించి మొక్కుబడులు తీర్చుకున్నారు. స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజనం మంత్రపుష్పం, పుణ్యా వచనం, కళ్యాణం తదితర కార్యక్రమాలను అర్చక బృందం వైభవంగా నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. శనివారం స్వామివారి ఆదాయం 35 లక్షలు సమకూరింది. స్వామివారిని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిషోర్ కుమార్, ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జగన్మోహిని కేశవ స్వామి అన్నదాన పథకానికి రూ.1.45 లక్షలు విరాళం

ఆత్రేయపురం, మేజర్‌న్యూస్ : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి అన్నదాన పథకానికి బెంగళూరుకు చెందిన మిరియాల దత్త సాయినాథ్, సత్య శ్రావణి దంపతులు రూ.1,45,500 లక్షలు విరాళంగా అందించారు.

వీరికి ఆలయ అర్చక బృందం మర్యాదలతో స్వాగతం పలికి చరిత్ర గురించి వివరించి దర్శనం చేయించారు. ఈవో కృష్ణ చైతన్య దాతలకు స్వామివారి చిత్రపటం అందించారు.

ఘనంగా శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారి జలకం

అంబాజీపేట, మేజర్ న్యూస్ : తొండవరం గ్రామంలో వేంచేసియున్న గ్రామదేవత శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారి జలకాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ముడు పులు, మొక్కుబడులు, చలివిడి పానకాలు, నైవేద్యాలు చెల్లించుకున్నారు.

అమ్మవారి జలకం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో ఉన్న కాలనీలలో అమ్మవారి పూజ ఘటాలను ఊరేగిస్తూ జలకం కన్నుల విందుగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

పంతం సందీప్ జన్మదినాన్ని పురస్కరించుకొని రక్తదానం

– రక్తదాతలకు కృతజ్ఞతలు తెలిపిన రూరల్ పంతం నానాజీ

– దివ్యాంగునికి ఎలక్ట్రికల్ ట్రై సైకిల్ పంపిణీ

కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ : కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తనయుడు పంతం సందీప్ (జూన్ 30వ తేదిన) జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎన్డీయే నాయకుల సహకారంతో శ్రీ యువసేన బ్లడ్ బ్యాంక్ వారు ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరంలో పంతం నానాజీ పాల్గొని రక్తదాన దాతలకు కృతజ్ఞతలు తెలపడం జరిగింది. అనంతరం కరప గ్రామానికి చెందిన దివ్యాంగుడు దున్నే లక్ష్మణరావుకి ఎలక్ట్రికల్ ట్రై సైకిల్ పంపిణీ చేయడం జరిగింది.

వెల్ఫేర్‌బోర్డు ఫైలుపైనే తొలి సంతకం!

– కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్

– ఏఐటీయూసీ నేతలకు మంత్రి హామీ

రామచంద్రపురం, మేజర్ న్యూస్ : భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు ఫైలు పైనే తనతొలి సంతకం చేస్తానని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టిసుభాష్‌తెలిపారు.ఆంధ్రప్రదేశ్ భవననిర్మాణ కార్మికసంఘం ఏఐటీయూసీ రాష్ట్ర నాయకత్వ బృందం శనివారం రాష్ట్ర కార్మిక శాఖామాత్యులు వాసంశెట్టి సుభాష్‌ను రామచంద్రపురం మున్సిపల్ కార్యాలయంలో కలసి సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం అందచేసింది. దానికి మంత్రి సుభాష్ సానుకూలంగా స్పందించి తమ ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి కట్టుబడి కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.మంత్రినికలిసినబృందంలోఏఐటీయూసీఅనుబంధ ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ, పశ్చిమగోదావరి జిల్లా శాఖ అధ్యక్షుడు బొల్లాడ నాగరాజు, ప.గో. జిల్లా కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, జిల్లాకార్యవర్గ సభ్యులు కోడె సాయి బాలాజీ తదితరులు ఉన్నారు. రాష్ట్ర కార్మికశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వాసంశెట్టి సుభాష్‌కు రాష్ట్ర భవననిర్మాణకార్మికసంఘంతరపునఅధ్యక్ష కార్యదర్శులు పుప్పాల సత్యనారాయణ, పడాల రమణ శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును క్రియాశీలం చేసిసభ్యుల పెండింగు క్లెయిములను పరిష్కరించి నిధులను మంజూరు చేయాలని, యాభై సంవత్సరాలు నిండిన భావన నిర్మాణ కార్మికులకు పెన్షన్ సదుపాయం కల్పించాలనిమంత్రికి అందచేసిన వినతిపత్రంలో కోరారు.మంత్రి సుభాష్ స్పందిస్తూతన మొదటి సంతకం సంక్షేమబోర్డు ఫైలు పైనే పెడతానని హామీ ఇచ్చారు.

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం 2009లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, 2019 సంవత్సరం వరకు క్లెయిములకు నిధులు మంజూరు చేసేవారని, 2019 తర్వాత గత ప్రభుత్వం నిధులను నిలిపివేసి, జిఓ నెంబర్ 17ను తెచ్చి కార్మికులకు అన్యాయం చేసిందని వివరించారు. సభ్యత్వం చెల్లించి అర్హత పొందిన కార్మికులకు గతంలో వెల్ఫేర్ బోర్డు ద్వారా పలు ఆర్థిక సహాయాలు అందేవని, జగన్ ప్రభుత్వం వాటిని నిలిపి వేసిందని వారు మంత్రికి వివరించారు. ప్రైవేటు భవన నిర్మాతల నుండి, ప్రభుత్వ నిర్మాణాలు చేసిన కాంట్రాక్టర్ల నుండి సెస్సు వసూలు చేసి వెల్ఫేర్ బోర్డుకు జమ చేస్తారని, ఆ నిధుల నుండి కార్మికుల క్లేయిములు ఇస్తారని వారు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిననాటికి వెల్ఫేర్ బోర్డులో సుమారు 22 లక్షల మంది కార్మికులు సభ్యత్వం కలిగి వున్నారని, బోర్డులో నిల్వ ఉన్న వేల కోట్ల రూపాయల నిధులను గతరాష్ట్ర ప్రభుత్వంతమఇతర పథకాలకు దారి మళ్లించడంతో రాష్ట్రంలో దాదాపు 42 వేలక్లెయిములుపెండింగులో ఉండిపోయాయని, వెల్ఫేర్ బోర్డులో కొత్త సభ్యుల నమోదును ప్రభుత్వం నిలిపివేయడంతో రాష్ట్రంలో భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న మరో ముప్పై లక్షల మంది కార్మికులు బోర్డులో చేరలేని పరిస్థితి ఏర్పడిందని మంత్రికి యూనియన్ నాయకులు వివరించారు. కార్మికులకు అన్యాయం చేసిన ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడం జరిగిందని, ఇప్పుడు నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగు క్లెయిములను పరిష్కరించాలని, గత ప్రభుత్వం దారి మళ్ళించిన నిధులను తిరిగి బోర్డుకు జమ చేయాలని, ఉచితఇసుక పాలసీ తీసుకువచ్చి కార్మికులను ఆదుకోవాలని వారు మంత్రిని కోరారు.మంత్రి సుభాష్ స్పందిస్తూ తమ కూటమి అధికారంలోకి రావడంలో భవన నిర్మాణ కార్మికులు కీలక పాత్ర పోషించారని,వారికి పూర్తిగాన్యాయంచేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి రాసబత్తులఅను కుమార్, ఏగేపల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్ట్ టైమ్ ఇనస్ట్రక్టర్, ఆర్ట్ ఆండ్ క్రాఫ్ట్,పిఈటీలను రెగ్యులర్ చేయాలి

– పి.గన్నవరం ఎమ్మెల్యేకు వినతి

అంబాజీపేట, మేజర్ న్యూస్ : కనీస వేతనంలో రూ.33,000లు ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. తమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించి సమస్యలు పరిష్కరించి తమను ఆదుకోవాలని పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ను పార్ట్ టైమ్ ఇనస్ట్రక్టర్ కోరారు. తొండవరంలో ఎమ్మెల్యే కు డిమాండ్ లతో కూడిన వినతిపత్రం అందచేసారు. 2012 నుండి ప్రభుత్వ పాఠశాలల్లో సమగ్ర శిక్ష కింద సుమారు 5వేల మంది ఉపాధ్యాయులు రాష్ట్ర వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్నామని పార్ట్ టైమ్ ఇనస్ట్రక్టర్ (ఆర్ట్ ఆండ్ క్రాఫ్ట్, పిఈటీ) లను రెగ్యులర్ చేయాలని, మాకెవ్వరికి ఇప్పటి వరకు ఉద్యోగ భద్రతలేదని, చాలిచాలని జీతాలతో జీవిస్తున్నామన్నారు. ప్రభుత్వం నుండి వచ్చే ఈపీఎఫ్, ఈసీఎస్ వంటివి ఏవి వర్తించడం లేదన్నారు. పార్ట్ టైమ్ పదం మార్చి ఒకేషనల్ ఇనస్ట్రక్టర్‌గా చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి మాట్లాడుతూ పీటీఐల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.కార్యక్రమంలో గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబు, మైపాల తాతాజీ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, దొమ్మేటి సాయికృష్ణ. పీటీఐలు పాల్గొన్నారు. అలాగే తొండవరం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు డైనింగ్ హాల్, సైకిల్ షెడ్, అసంపూర్తిగా ఉన్న అదనపు తరగతి భవనాలు, వంటశాల, పాఠశాల క్రీడాప్రాంగణం అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని హెచ్ఎం పి.వి. కేశవాచార్యులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సత్యనారాయణకు వినతి పత్రాన్ని అందించారు. అలాగే శివారు ప్రాంతమైన హైస్కూల్లో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు.

తెదేపా నూతన అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును అభినందించిన బూరుగుపల్లి శేషారావు

పెరవలి,మేజర్‌న్యూస్:రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నూతన అధ్యక్షులుగా నియమితులైన గాజువాక నియోజకవర్గ శాసనసభ్యులు పల్ల శ్రీనివాసరావుని జూన్ 29వ తేదీ శనివారం నిడదవోలు మాజీ శాసనసభ్యులు నిడదవోలు తెదేపా ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు కలిసి పుష్పగుచ్చం అందజేసే అభినందనలు తెలియజేశారు. ఈ మర్యాదపూర్వక భేటీలో శేషారావుతో పాటు నిడదవోలు, ఉండ్రాజవరం మండలాలకు చెందిన తెదేపా మండల పార్టీ అధ్యక్షులు, పెరవలి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అతికాల కృష్ణమ్మ శ్రీను, డీసీఎంఎస్ మాజీ అధ్యక్షులు భూపతిరాజు రవివర్మ, నిడదవోలు నియోజకవర్గతెలుగుదేశం పార్టీనాయకులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రత్యేక పూజలు

ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారిని శనివారం కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా దంపతులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిషోర్ కుమార్ స్వాగతం పలికారు. అర్చక బృందం స్వామివారి చరిత్ర గురించి వివరించి స్వామి దర్శనం చేయించారు.

ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయ ఖాళీలను ఏజెన్సీ నిరుద్యోగులతోనే భర్తీ చేయాలి

ఎటపాక, మేజర్ న్యూస్ : ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ అత్యవసర సమావేశాన్ని శనివారం ఎటపాక మండల స్థానిక కార్యాలయంలో మండల ప్రధాన కార్యదర్శి కాక శివశంకర్ అధ్యక్షతన నిర్వహించగా ఈ సమావేశంలో మండల అధ్యక్షులు కాక రాజు మాట్లాడుతు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొన్న మెగా డీఎస్సీ-2024లో భాగంగా 16,347 పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించడం జరిగింది. మన్యం ప్రాంతంలో రెండు వేల పైచిలుకు ఖాళీలను గుర్తించడం జరిగింది ఏజెన్సీ ప్రాంత ఖాళీలను ఏజెన్సీ అభ్యర్థులతోనే భర్తీ చేయాలని అందుకు గాను ఏజెన్సీ ప్రాంత నిబంధనల మేరకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా జనరల్ విభాగంలో ఏజెన్సీ పోస్టులను గిరిజనేతరులతో భర్తీ చేసినట్లయితే ఆదివాసి నిరుద్యోగులకు తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు. గత కొద్ది సంవత్సరాలుగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక ఆదివాసి యువత తీవ్ర నిరాశలో ఉన్నారని, రాజ్యాంగం ఏజెన్సీకి కల్పించిన ప్రత్యేక చట్టాలను అనుసరించి డిఎస్సి 2024 ను భర్తీ చేయాలని అన్నారు.ఈ విషయంలో ఆదివాసి ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోబ డిన నూతన ఎమ్మెల్యేలందరూ టిఎస్సి తీర్మానం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఈ సమస్యను పరిష్కరించే మార్గాలను వెంటనే చేపట్టి ఏజెన్సీ నిరుద్యోగ యువతకు తగు న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కట్టం వెంకటేశ్వర్లు, ఇరకం కాంత రావు, పండా కిరణ్, ఆప్కా నాగేశ్వరరావు, రాజశేఖర్ పొడియం రామకృష్ణ, తుర్రంరజని,గంగాభవాని,పోడియం కామేశ్వరరావు పాల్గొన్నారు.

విశేషంగా ఆకట్టుకున్న పురాతన కెమెరాల ప్రదర్శన

కాకినాడ, మేజర్ న్యూస్ : జాతీయ కెమెరాల దినోత్సవం సందర్భంగా కాకినాడ కెమెరా క్లబ్ మరియు ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక టౌన్ హాల్ సమావేశ మందిరమందు పురాతన కెమెరాల ప్రదర్శనను శనివారం నిర్వహించారు. ఈ ప్రదర్శనను దేవాదాయశాఖ విశ్రాంత అధికారి, సీనియర్ ఫోటోగ్రాఫర్ బళ్ల జగన్నాథం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం సభ్యులను ఉద్దేశించి జగన్నాథం మాట్లాడుతూ ఇటువంటి ప్రదర్శన ద్వారా కెమెరాల యొక్క ఆకారాలు మరియు విశేషాలు నేటి తరానికి తెలుసుకోవడానికి ఎంతో వీలు ఉందని చెప్పారు. అప్పటి కెమెరా వినియోగం ఎంతో కష్టంగా ఉండేదని నేడు ఎంతో సులభతరం అయినందున కెమెరాల వినియోగం పట్ల ప్రజలలో మక్కువ పెరుగుతూనే ఉందని చెప్పారు. కెమెరాల ద్వారా తీసిన ఫోటోలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని చెప్పారు. ఫోటోలు అంటే రానున్న తరానికి సజీవ సాక్ష్యాలుగా నిలిచే చరిత్రగా ఆయన ప్రస్తావించారు. గౌరవ అతిథిగా సినిమాటోగ్రఫర్, సీనియర్ సభ్యులు పుట్ట మల్లిక్ పాల్గొన్నారు.కాకినాడ కెమెరా క్లబ్ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో సుమారు నూట ఎనభై సంవత్సరాల క్రితంనాటి కెమెరాలను కూడా ఉంచడం జరిగిందన్నారు. తమ క్లబ్ సభ్యులు, రామచంద్రపురం స్టూడియో అధినేత వి.బాలకృష్ణ ఆధ్వర్యంలో సేకరించిన సుమారు 500 కెమెరాలను మరియు వీడియో కెమెరాలు కూడా ఈ ప్రదర్శనలో తిలకించవచ్చునారు. కాకినాడ కెమెరా క్లబ్ ఏర్పడి సుమారు 53 సంవత్సరాలు అవుతుందని, ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా జాతీయ కెమెరాల దినోత్సవం విజయవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహించడం ద్వారా ప్రస్తుత కెమెరామెన్లకు అవసరమైన పరిజ్ఞానాన్ని అందించడం జరుగుతుందని వివరించారు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా వర్క్‌షాప్‌తో పాటు పురాతన కెమెరాల ప్రదర్శన మరియు వివిధ పోటీలలో పాల్గొని విజేతలైన ఫోటోగ్రాఫర్ల తాలూకు ఫోటోలను కూడా ప్రదర్శించడం జరుగుతుందని వివరించారు. కాకినాడ కెమెరా క్లబ్‌ను 1971లో అప్పటి జిల్లా కలెక్టర్ మాలకొండయ్య అధ్యక్షతన వైద్యులు, ఇంజనీర్లు, ప్రొఫెసర్, మరియు కెమెరామెన్‌చే సంయుక్తంగా ఏర్పాటు చేయబడిందని గుర్తు చేశారు.

కార్యక్రమంలో కాకినాడ కెమెరా క్లబ్ అధ్యక్షులు ఎన్.వి.ఎస్.ఎస్.రామమూర్తి (బాబి), ఉపాధ్యక్షులు డాక్టర్ శివరామకృష్ణ (ఇంజనీర్), సంయుక్త కార్యదర్శి జి.జె.వి.ఎస్.వి.ప్రసాద్, కోశాధికారి నేరేడు సోమరాజు, సభ్యులు కొర్లపాటి సరస్వతీరావు, తుమ్మలపల్లి వీరభద్రరావు, ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట సూర్యసుబ్బారావు, గౌరవ అధ్యక్షులు జశ్వంత్ శ్రీను, కార్యదర్శి కమ్రు జమ, ఎం.బాబురావు, సుబ్బు, వి.బాలకృష్ణ కుమారస్వామి (పెద్ద)తో పాటు అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల ఆరోగ్యానికి హెల్త్ కార్డులు

– ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం, మేజర్ న్యూస్ : ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలు, గురుకుల పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు విద్యతోపాటు ఆరోగ్య పరిస్థితులు ఎప్పటికప్పుడు తెలుసుకునే విధంగా విద్యార్థులకు ఫోటోతో హెల్త్ కార్డులు ఏర్పాటు చేయడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గానోరే పేర్కొన్నారు. శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం నుండి రంపచోడవరం, చింతూరు డివిజన్ లకు సంబంధించిన అసిస్టెంట్ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, గిరిజన సంక్షేమశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ లు, సిబ్బందితో విద్యార్థులకు హెల్త్ కార్డులు ఏర్పాటు, జిసిసి ద్వారా నిత్యావసర వస్తువులు, కూరగాయలు, చికెన్, గుడ్లు, పాలు సకాలంలో ఏర్పాటు చేసే విధంగా ప్రాజెక్ట్ అధికారి వీడియో కాన్ఫరెన్స్ కొంతమంది అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే మాట్లాడుతూ ఏజెన్సీలో అన్ని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్స్ స్కూళ్లలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు ఎప్పటికప్పుడు తెలుసుకునే విధంగా వైద్యాధికారులు వైద్య సేవలు అందించే విధంగా ప్రతీ విద్యార్థికి హెల్త్ కార్డులు ఫోటోతో పాటు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. వర్షాకాలంలో వివిధ రకాలైన జ్వరాలు రాకుండా ప్రతీ ఆశ్రమ పాఠశాలలో దోమలు నివారించేందుకు పాగింగ్ పంచాయతీలు ద్వారా చేయించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. అన్ని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆయన అన్నారు. అన్ని ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు సరఫరా చేస్తున్న తాగునీరు, వాటర్ ట్యాంకులు ఎప్పటికప్పుడు క్లీన్ చేయించాలని ఆయన అన్నారు. విద్యార్థులకు ఎవరికైనా జ్వరం వచ్చిన వెంటనే దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి తీసుకు వెళ్లి రక్త పరీక్షలు చేయించి ఆయా వ్యాధులకు మందులు విద్యార్థులతో వాడించాలన్నారు. విద్యార్థులకు ప్రతీరోజు తాజా ఆహార పదార్థాలు తయారు చేయించి వేడిగా అందించాలన్నారు. విద్యార్థులకు జిసిసి ద్వారా నిత్యావసర వస్తువులు క్వాలిటీతో సరఫరా చేస్తున్నది, లేనిది, వారానికి రెండు రోజులు కోడి మాంసం విద్యార్థులకు అందించే విధంగా ఎక్కడి నుండి కోడి మాంసం తీసుకువస్తున్నారు, ఏఊరిలో ఫారం నుండి కోళ్లను తీసుకొస్తున్నారు వివరాలు సేకరించి నివేదికలు తయారు చేసి సమర్పించాలని ఆయన అన్నారు. విద్యార్థులకు సరఫరా చేసే కూరగాయల వెండర్లు వారానికి ఎన్ని రోజులు సరఫరా చేయుచున్నది అదేవిధంగా తాజా తాజాగా సరఫరా చేయుచున్నది లేదా అని ఆయన ఆరా తీశారు. పాలు గుడ్లు ఏవిధంగా సరఫరా చేయుచున్నది ఆయన ఆరా తీశారు. అన్ని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రస్తుతం ఎంతమంది ఉన్నది ఎంతమంది సెలవుల్లో ఉన్నది, ఎంతమంది డిప్యూటేషన్లు పై ఉన్నది, ఎంతమంది ఉపాధ్యాయులు ఆబ్సెంట్ లో ఉన్నది నివేదికలు తయారు చేసి సమర్పించాలని ఆయన ఆదేశించారు.ఈ సమావేశంలోఅసిస్టెంట్ గిరిజన సంక్షేమశాఖ అధికారులు కె.సుజాత, రామతులసి, ప్రసాద్, సూపరింటెండెంట్బి.కిషోర్సీనియర్ సహాయకులు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, చక్రధర్ బాబు, నాగేంద్ర, వెంకట రాజన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 90 కేసులు పరిష్కారం

రామచంద్రపురం, మేజర్ న్యూస్ :స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన నేషనల్ లోక్ అదాలత్ కార్యక్రమంలో 90 కేసులు పరిష్కారం అయ్యాయని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మరియు సీనియర్ సివిల్ జడ్జి కే.వెంకటేశ్వర్రావు తెలిపారు. వీటిలో రూ.2,36,43,859 విలువగల కేసులు పరిష్కారం అయ్యాయని అన్నారు.అందులో 21 సివిల్ కేసులు, 56 క్రిమినల్ కేసులు, మరియు 6 బిఎస్ఎన్ఎల్ పిటిషన్‌లు పరిష్కరించబడినవి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ మరియు అడిషనల్ ఫస్ట్ క్లాస్ జ్యూడిషల్ మెజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు నాయక్, డిఎస్పీ బి.రామకృష్ణ, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పలివెల సత్యనారాయణ, సీఐ పి.దొరరాజు, ఎస్సై కె.సురేష్ బాబు, లోక్ అదాలత్ సభ్యులు పీవీఎస్ జానకి, ఎస్.బి.ఎస్.కే. కుమారస్వామి, చింతపల్లి శ్రీనివాసు, న్యాయవాదులు, లోక్‌అదాలత్ సిబ్బంది, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

జీవో నెం:3కి చట్టబద్ధత కల్పించాలి

కూనవరం, మేజర్ న్యూస్ : మండల విద్యా వనరుల కేంద్రం కూనవరం ప్రాంగణంలో ఆదివాసీ టీచర్ అసోషియేషన్ (ఏ టి ఏ) కూనవరం మండల కమిటీ అధ్యక్షుడు చిచ్చుడి జితేంద్ర ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సరియం అనిల్ కుమార్ మాట్లాడుతూ ఇటీవలి ప్రకటించిన మెగా డిఎస్సీ నందు రాజ్యాంగం లో ఐదవ షెడ్యూలు ప్రాంతాల కు ఉన్న అధికారాలలో భాగంగా జీవో నెం 3 ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డిఎస్సీ ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు గతం లో ప్రతి పక్ష హోదాలో అరకు సభ లో జీవో నెం 3 ఇచ్చిన హామీ నిలబెట్టు కోవాలని కోరారు. అలాగే జీవో నెం 117 వల్ల ప్రాథమిక పాఠశాలలు తీవ్రంగా నష్టపోయాయని 117 రద్దు చేసినట్టయితే యస్ జి టి పోస్టులు డిఎస్సీ పెరుగుతాయని తెలిపారు. అదే విధంగా జిల్లా కార్య వర్గ సభ్యులు కట్టం వీరయ్య మాట్లాడుతూ ఆదివాసీ జిల్లాలుగా చేసి నందున జిల్లాల వారీగా నైనా ప్రత్యేక డిఎస్సీ నిర్వహించాలని, అదేవిధంగా జీవో నెం 3 కోసం ఆదివాసీ టీచర్ అసోషియేషన్ (ఏటిఏ) నిరంతరంగా పోరాడుతూనే ఉంటుందని తెలిపారు. అలాగే జీవో నెం 3కి చట్ట బద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుంజా జితేంద్ర, సత్యనారా యణ, బొడ్డు శ్రీను, మహిళా ఉపాధ్యాయినిలు భవాని, రేణుక పాప, అరుణ, స్వరూప, వెంకటలక్ష్మి,భారతి మొదలగు వారు పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన తెదేపా నాయకులు

అంబాజీపేట,మేజర్‌న్యూస్ : రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావును పి.గన్నవరం నియోజకవర్గ టీడీపీ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించినడీజీపీకి పుష్పగుచ్చం. పూలమాలలతో ఘనంగా సత్కరించారు.డీజీపీని కలిసినవారిలో నాయకులు యర్రాశ్రీనివాసరావు, ఎస్.కె.సుభాన్, ఎస్.కె.మీర తదితరులు ఉన్నారు.

నల్లాకులవారిపాలెంలో కొబ్బరి మొక్కలు నాటిన సర్పంచ్ కోటా శ్రీను

పెరవలి, మేజర్ న్యూస్ : నల్లాకు లవారిపాలెం గ్రామంలో నక్కల కాలువ గట్టు వద్ద జూన్ 29వ తేదీ శనివారం అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా నల్లాకులవారిపాలెం గ్రామానికి మం జూరు చేసిన 200 కొబ్బరి చెట్లను గ్రామ సర్పంచ్ నల్లాకుల వెంకటేశ్వరరావు (కోటా శ్రీను) ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ ఉపాధి హామీ పథకం వారిచే కొబ్బరి మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోటా శ్రీను మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ కొబ్బరి మొక్కలు పాతుతున్నామని అన్నారు. మొక్కలు పెంపకం ద్వారా పర్యావరణ సమతుల్యం సాధించడమే కాకుండా పంచా యతీకి కూడా ఆదాయం వస్తుందని ఆయన అన్నారు. మొక్కల పెంపకం ద్వారా కాలుష్యాన్ని కూడా తగ్గించవచ్చునని యువత అందరూ మొక్కలు పెంపకంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

కానూరు అగ్రహారం గ్రామంలో కొబ్బరి మొక్కలు నాటిన కూటమి నాయకులు

పెరవలి, మేజర్ న్యూస్ : కానూరు అగ్రహారం గ్రామంలో జూన్ 29వ తేదీ శనివారం గోదావరి ఏటిగట్టుకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా కొబ్బరి మెక్కలు నాటారు కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీల కూటమి నాయకులు దాసం బాపన్ననాయుడు, హనుమంతు సుబ్రహ్మణ్యం, హరిదాసు సుబ్బారావు, పెన్నాడ పుత్రయ్య, సత్తి చినకాపు, గరగ సత్యనారాయణ, గుండాల నాగమునేశ్వర్రావు, హనుమంతు సత్యనారాయణ, దాసరి పోలయ్య, యర్రంశెట్టి శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వర స్వామి ఆలయంలో భక్తులు తైలాభిషేకాలు

కోత్తపేట,మేజర్న్యూస్ : మండల పరిధిలోని మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర (శనేశ్వర)స్వామి వారి దేవస్థానంలో శనివారం సందర్భంగా తెల్లవారుజాము నుండి స్వామి వారికి ప్రాతఃకాల అర్చన నిర్వహించి, అనంతరం భక్తులచే తైలాభిషేకాలు, సర్వ దర్శనములు జరిపించారు. తైలాభిషేకముల ద్వారా రూ.1,55,450, అలాగే అన్న ప్రసాదం విరాళాలుగా రూ.44,619 ఆదాయం వచ్చాయని ఆలయ కార్య నిర్వహణాధికారిణి కె.విజయలక్ష్మి తెలియజేశారు.

గిరిజన ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించాలి

– జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే శిరీష దేవి

రంపచోడవరం, మేజర్ న్యూస్ : గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి పాడేరులో నూతన జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష దేవి, భర్త తెలుగు యువత అధ్యక్షులు విజయభాస్కర్ శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిసారు. ఈసందర్భంగా కలెక్టర్ దృష్టికి రంపచోడవరం నియోజకవర్గం పరిధిలో పలు సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా వివిధ పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులు చేరేందుకు అవకాశం కల్పించాలని, మరికొన్ని సీట్లు వెంటనే కేటాయించాలని కోరారు. అలాగే మంచి నీటి సమస్య, ప్రధాన రోడ్లు, విద్యుత్ సరఫరా వంటి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇదే క్రమంలో ప్రస్తుతం వర్ష కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందస్తు జాగ్రత్తలు చర్యల్లో భాగంగా ముంపు ప్రాంతాలైన చింతూరు, కూనవరం, ఎటపాక, వర రామచంద్రపురం మండలాల పరిధిలోని గ్రామ ప్రజలకు ఎటువంటి అవాంతరాలు, ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలని ఎమ్మెల్యే శిరీష దేవి, భర్త విజయ భాస్కర్ కోరుతూ పలు కీలక సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కు అందజేశారు.

రంపచోడవరం ఎస్టీ నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, భర్త తెలుగు యువత అధ్యక్షులు విజయభాస్కర్ శనివారం జిల్లా ప్రధాన కేంద్రం పాడేరు చేరుకున్నారు. ఎమ్మెల్యే గా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారిగా జిల్లా కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే శిరీష దేవి , భర్త విజయ భాస్కర్ దంపతులకు పాడేరు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా పాడేరులో మోదుకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే దంపతులను పూలమాలలు, శాలువలతో ఘనంగా సత్కరించారు. అనంతరం స్థానిక టీడీపీ నియోజకవర్గం ఇంచార్జి గిడ్డి ఈశ్వరి ఇంట్లో విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు టీడీపీ మండల అధ్యక్షుడు కుడి రామానాయుడు, సర్పంచ్ లకే పార్వతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా విజయ రాణి, టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యాయులు పోలుపర్తి గోవిందు మాస్టర్, వైస్ ఎంపీపీ గంగ పూజరి శివకుమార్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు దప్పాడి వెంకటరమణ, మహిళా అధ్యక్షులు అల్లంగి సుబ్బలక్ష్మి, కిండ్డంగి సర్పంచ్లు డుంబేరి విశ్వనాధం, బాకురి వేంకట రమణరాజు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసిన కమిషనర్

కాకినాడ, మేజర్ న్యూస్ : రాష్ట్ర పౌరసరఫరాలు, ఆహారం, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. కాకినాడ పర్యటనకు వచ్చిన ఆయనను కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

వర్షపు నీటిలో ఆర్.బి.కే

కాకినాడ, మేజర్ న్యూస్ : మండల కేంద్రం కరపలోని రైతు భరోసా కేంద్రానికి ధాన్యం ఇచ్చిన రైతులు శనివారం తమ బకాయిలు చెల్లించాలంటూ వచ్చారు. అక్కడ వారికి సరైన సమాధానం లభించలేదు. దీంతో జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి భోగిరెడ్డి గంగాధర్ దృష్టికి వారు ఈ విషయాన్ని తీసుకువెళ్లారు. ఆర్.బి.కే. ల ద్వారా రైతులకు లబ్ధి చేకూరుతున్నది గంగాధర్ అడిగి తెలుసుకున్నారు. ఈ విషయాన్ని ఆయన ఎమ్మెల్యే పంతం నానాజీ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే రైతు భరోసా కేంద్రానికి వెళ్లి వివరాలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. దీంతో ఆయన వాటి వివరాలు అడిగి తెలుసుకోగా ఆశ్చర్యపోయే నిజాలు బయటపడ్డాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల ధాన్యాన్ని గత సీజన్‌లో నేరుగా ధాన్యం కొనుగోలు చేయగా రైతులకు ధాన్యం కొనుగోలు నగదు బకాయిలు చెల్లించడంలో జాప్యం గురించి రైతు భరోసా కేంద్రం సిబ్బంది తెలిపారు. గడిచిన 2023-2024 రబీ పంటను కరప రైతు భరోసా కేంద్రంకు 200 మంది రైతులు 999 మెట్రిక్ టన్నుల ధాన్యం అమ్మకాలు జరిపారు. ఇందుకు సంబంధించి రూ.2 కోట్ల 18 లక్షలు రైతులకు చెల్లించాల్సి ఉంది. వారిలో కేవలం 36 మందికి 44.78 లక్షల రూపాయలు మాత్రమే చెల్లించారు. మిగిలిన 164 మంది రైతులకు గాను 1.73 కోట్లు రైతులకు చెల్లించవలసి ఉందని తెలిపారు. మండలవ్యాప్తంగా రైతులకు 4.98 కోట్ల రూపాయల బకాయిలు చెల్లించడం లేదని పలువురు రైతులు తెలిపారు.ఈ రైతు భరోసా కేంద్రంలో పైకప్పు నుండి వర్షపు నీరు చేరి ఎరువు మొత్తం తడిసిపోయి నష్టం వాటిల్లుతోందని రైతులు ఆరోపించారు.

జల్దాని బాబీని పరామర్శించిన ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం మండలం, జి.రాగంపేట గ్రామ టిడిపి అధ్యక్షులు జల్దాని సుబ్రహ్మణ్యం (బాబీ)ని ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన దృష్ట్యా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శనివారం సాయంత్రం ఆయన స్వగ్రామంలో బాబీని పరామర్శించి, యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆయన వెంట టిడిపి నాయకులు దేవళ్ళ బోస్, దూసర్లపూడి యేసుబాబు, మంగిపూడి యేసుబాబు, సాంబత్తుల వెంకటేశ్వర్లు, అడపా వెంకటేష్, దూసర్లపూడి మధు, పసల సుబ్బారావు (గాంధీ), పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

శృంగార వల్లభ స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం,మేజర్ న్యూస్ : పెద్దాపురం మండలం, తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ శృంగార వల్లభ స్వామిని శనివారం వేలాది సంఖ్యలో భక్తులు దర్శించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కార్యనిర్యాణాధికారి వడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.1,91,850/-, అన్నదాన విరాళాల ద్వారా రూ.66,919/-లు, కేశఖండన ద్వారా రూ.5,760/-, తులాభారం ద్వారా రూ.350/- లడ్డూ ప్రసాదాల ద్వారా రూ.25,470/-, కానుక ద్వారా రూ.3000 మొత్తం రూ.2,93,349/-లు స్వామివారికి ఆదాయం రావడం జరిగిందని తెలిపారు. స్వామివారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించడం జరిగింది. అలాగే దేవస్థానం తరపున ఉదయం పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు పెద్దింటి నారాయణాచార్యులు, పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి గోపాలాచార్యులు, ఆలయ సిబ్బంది కృష్ణ, మోహనరావు, సత్యనారాయణ, ఇతర స్వచ్ఛంద సేవకులు, వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలి

– ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో పురపాలక సంఘంలో పుర ప్రజలకు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. శనివారం పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు ప్రకాష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా స్వచ్ఛమైన త్రాగునీరును పురప్రజలకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని, అలాగే శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. పెద్దాపురం పురపాలక సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కౌన్సిల్ సభ్యులు సహకరించి, పురపాలక సంఘం అభివృద్ధికి తొడ్పాడాలని ఎమ్మెల్యే రాజప్ప సూచించారు. శతాబ్ది పార్కును, పెట్రోల్ బంక్ వద్ద వాకింగ్ ట్రాక్, సెంట్రల్ లైటింగ్ వెంటనే ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు ఆయా వార్డులలోని సమస్యలపై సమావేశంలో లేవనెత్తారు. దీనికి ముందుగా ఎమ్మెల్యే రాజప్పకు మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లు నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మీ, కమీషనర్ కె.వి.పద్మావతి, పలువురు కౌన్సిలర్లు స్వాగతం పలికి, దుశ్శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా 'ఎన్‌టీఆర్ భరోసా' పంపిణీ

– సిటీ ఎమ్మెల్యే వనమాడి సూచన
– అధికారులతో సమీక్ష

కాకినాడ, మేజర్ న్యూస్ : జూలై 1వ తేదీన జరిగే ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఎలాంటి లోటుపాట్లు లేకుండా సకాలంలో లబ్ధిదారులకు అందజేయాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) కోరారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ప్రక్రియపై సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, వెల్ఫేర్ సెక్రటరీలతో సమావేశమయ్యారు. నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే వనమాడి మాట్లాడుతూ సోమవారం ఉదయం 6 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం ఉన్న పింఛన్‌ను రూ.3వేలు నుంచి రూ.4వేలకు పెంపుదల చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారన్నారు. అలాగే పెంచిన పింఛన్ మొత్తాన్ని ఏప్రిల్, మే, జూన్ మూడు నెలలకు కలిపి మొత్తం రూ.7వేలు చొప్పున పంపిణీ చేస్తున్నారని చెప్పారు. ప్రతీ సచివాలయ పరిధిలో పింఛన్ల పంపిణీ ప్రక్రియను క్రమ పద్ధతిలో ప్రతీ ఒక్కరికి సకాలంలో చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్‌టీఆర్ భరోసా ద్వారా సాధ్యమైనంత వరకూ నూటికి నూరు శాతం 1వ తేదీ సాయంత్రం లోపుగా పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం ఆయా లబ్ధిదారులకు భరోసా కల్పించాలనే ఉద్దేశ్యంతోనే పింఛన్ల మొత్తాన్ని పెంచి స్వయంగా ముఖ్యమంత్రి చేతులు మీదుగా పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు మాట్లాడుతూ కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో 30వేల 552 మంది లబ్ధిదారులకు రూ.21.30 కోట్ల సొమ్ము పంపిణీ చేస్తున్నామన్నారు. ఆయా సచివాలయ కార్యదర్శులకు లక్ష్యాన్ని నిర్ధేశించి ప్రతీ ఇంటికి వెళ్ళి లబ్ధిదారులకు పింఛన్లు ఇచ్చేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రతీఒక్క లబ్ధిదారునికి నేరుగా వెళ్ళి పింఛన్లు అందజేయాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ పి.సత్య కుమారి, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వి చరణ్, ఆయా సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

గిరిజనులను ఇబ్బంది పెడుతున్న అటవీ శాఖ అధికారులు

– అధికారుల తీరును తప్పు పట్టిన టిడిపి మండల పార్టీ

కూనవరం, మేజర్ న్యూస్ : కూనవరం మండలం పందిరజుపల్లి గ్రామానికి చెందిన పోడియం లక్ష్మి పోడియం సుబ్బారావు పొలంలో జెసిబి ద్వారా మోడీలు తొలగిస్తా వుండగా అటవీ శాఖ అధికారులు వారం రోజుల క్రితం జెసిపిని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. గిరిజనులు ఈ విషయాన్ని మాజీ మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గిరిజన నాయకుడైన పడే అప్పారావు దృష్టికి తీసుకురాగా అటవీ శాఖ అధికారులను కలిసి ఇది గిరిజనుల పొలం అని వాళ్ల పొలాన్ని వాళ్ల చదును చేస్తా ఉంటే కేసు ఎందుకని అధికారులను అడిగారు స్థానిక అటవీ శాఖ అధికారులు మా వద్దకు ఎవరూ రాకూడదని మాకు ఎవరు ఏ విషయాన్ని మాట్లాడకూడదని మాతో మాట్లాడితే మేం కేసులు పెట్టే అధికారం ఉందని తెలిపినట్లు పొడి అప్పారావు పాత్రికేయులు దృష్టికి తీసుకువచ్చారు అటవీశాఖ అధికారులు రాజ్యాంగబద్ధంగా ఉండరా రాజ్యాంగం కల్పించే హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తున్నారని గిరిజనులు గాని గిరిజనుల నాయకులు గాని ఎవరు అటవీ శాఖ అధికారులు ప్రశ్నించకూడదని ప్రశ్నిస్తే కేసులు నమోదు చేసే అధికారం మాకు ఉందని వాళ్ళు తెలపటం విడ్డూరంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు గిరిజన సమస్యలపై గిరిజన నాయకుడుగా మేము అధికార పార్టీ అయినప్పటికీ పోరాటం చేయవలసి వస్తే చేస్తామని అధికారులు తీరు మార్చుకోకపోతే ఇబ్బందుల ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన అన్నారు. అటవీ శాఖ అధికారుల తొందరపాటు వలన గిరిజన కుటుంబానికి 65 వేల రూపాయల నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు 25680 రూపాయలు ప్రోక్లెన్ అధ్య ఎనిమిది రోజులకి 40 వేల రూపాయలు గిరిజనుల చెల్లించారని గిరిజనులకు ఆ డబ్బు ఎవరిస్తారు అని ఈ విషయాన్ని పై అధికారులు దృష్టికి తీసుకెళ్తామని ఉదయం అప్పారావు తెలిపారు. ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు టిడిపి అధ్యక్షులు బరపాటు ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు

భవననిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డును పునరుద్ధరిస్తాం

– కార్మికశాఖ మంత్రి సుభాష్

కాకినాడ, మేజర్ న్యూస్ : మొదటి క్యాబినెట్ మంత్రుల సమావేశంలో, మొదటి నిర్ణయంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరించి వైసీపీ చేసిన తప్పులను సరిదిద్దుతామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేసారని వినతి పత్రం అందించిన సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు దువ్వ శేషబాబ్జి, చెక్కల రాజ్ కుమార్ పత్రికా ప్రకటన విడుదల చేశారు.

వివరాల్లోకెళ్తే ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి సుభాష్‌ని మర్యాదపూర్వకంగా కలవడానికి, కాకినాడ జిల్లాలో కార్మికుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లడానికి రామచంద్రాపురం స్వగృహం వద్ద కార్మికుల సమస్యలతో కూడిన వింతపత్రాన్ని సిఐటియు నాయకులు అందించిన సందర్భంగా కార్మిక శాఖ మంత్రి స్పందిస్తూ పరిశ్రమలలో కార్మికులను తొలగించి ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చే యాజమాన్యాల పట్ల కఠినంగా వ్యవహరిస్తానని, ఏ ఒక్క కార్మికుణ్ణి తొలగించినా ఊరుకునేది లేదని, చట్ట వ్యతిరేక తొలగింపులకు నేను వ్యతిరేకమని స్పష్టం చేశారు. అసంఘటితంగా కార్మికులకు వైసీపీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని దాన్ని సరిచేస్తూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించి కార్మికుల కుటుంబాలను ఆదుకుంటామని తెలిపారు.

త్వరలో జరగబోయే మొదటి క్యాబినెట్ మంత్రుల సమావేశంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరిస్తూ నిర్ణయం చేయబోతున్నామని సిఐటియు నాయకులకు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ కాకినాడ జిజిహెచ్ నందు అనేక డిపార్ట్‌మెంట్లో పిఎఫ్ సమస్య తీవ్రంగా ఉందని, కాంట్రాక్టర్లు యజమాని వాటా కూడా కార్మికుల జీతం నుంచి మిరహాయిస్తూ నెలల తరబడి పిఎఫ్ సొమ్మును డిపార్ట్మెంట్‌కు కట్టకుండా సొంత ప్రయోజనాలకు కార్మికుల సొమ్ము వాడుకుంటున్నారని మంత్రికి తెలియజేశారు. ఆక్వా జీడిపిక్కల పరిశ్రమలలో పనిచేసే మహిళల పరిస్థితి దారుణంగా ఉందని, కనీస వేతనాలు ఎక్కడా చెల్లించడం లేదని, షెడ్యూల్ పరిశ్రమల్లో ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను సవరించేందుకు కనీస వేతన సలహా మండలని తక్షణం నియమించాలని, ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26,000 ప్రకటించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆటో లారీ ట్రాన్స్‌పోర్ట్ హమాలి కార్మికులకు సామాజిక భద్రత కల్పించే చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల అమలను రాష్ట్రంలో నిలిపివేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు సహాయ కార్యదర్శి దారపురెడ్డి క్రాంతి, రాక్ సిరామిక్ కార్మికులు చంద్రశేఖర్, గంగాధర్, మంగారావు, మల్లిఖార్జున, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ పార్క్ అభివృద్ధికి చర్యలు

– కమిషనర్ జే.వెంకటరావు

కాకినాడ, మేజర్ న్యూస్ : ఎంతో చరిత్ర కలిగిన గాంధీనగర్ పార్క్ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు హామీ ఇచ్చారు. శనివారం ఆయన ఎస్ఈ పి.సత్యకుమారి ఇతర అధికారులతో కలిసి గాంధీపార్క్ ను సందర్శించారు. పార్కులో పర్యటించి అక్కడి వాకర్స్ తో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్కులో ఏర్పాటు చేసిన క్రీడా, జిమ్ పరికరాలను పరిశీలించారు. టాయ్ లెట్ల నిర్వహణను పర్యవేక్షించారు. పార్కు ఆవరణలో నిరుపయోగంగా, శిధిలావస్థకు చేరిన ఓ భవనాన్ని తక్షణమే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా మహిళల కోసం పార్కులో ఏర్పాటు చేసిన షటిల్ కోర్టును మహిళలు మాత్రమే వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ పార్కు ఆవరణను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు, సందర్శకులకు అనువుగా ఉండేలా అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఈఈ మాధవి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వి చరణ్, శానిటరీ సూపర్వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్స్పెక్టర్ రవివర్మ, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

సిసిఆర్‌సి కార్డుల పంపిణి ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

– ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం, మేజర్ న్యూస్ : పెద్దాపురం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో శనివారం ఆర్డీఓ జె.సీతారామావు అధ్యక్షతన డివిజన్‌లో 11 మండలాల పరిధిలో గల తహశీల్దార్లు, వ్యవసాయ శాఖ ఏడిలు, ఏఓలకు ఆర్డీఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ తెలుపుతూ సిసిఆర్‌సి కార్డుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని, కుల ధృవీకరణ సర్టిఫికెట్లు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రేషన్‌బియ్యం పంపిణీపై సమీక్షించడం జరిగింది. ఈ సమావేశంలో డివిజన్‌లో తహశీల్దార్లు, ఏడిఏలు, అగ్రికల్చర్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

కలెక్టర్ పి.ప్రశాంతిని కలిసిన జిల్లా రెవిన్యూ ఉద్యోగులు

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని కలెక్టర్ ఛాంబర్‌లో తూర్పు గోదావరి జిల్లా రెవిన్యూ ఉద్యోగులు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ అభివృద్ధి పథకాల అమలులో తమ శక్తివంతన మేరకు పనిచేసి రాష్ట్రంలో జిల్లాను అగ్రగామిగా నిలవడం విశేషం కృషి చేస్తామని రెవెన్యూ ఉద్యోగులు కలెక్టర్‌కు హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎపిఆర్ఎస్ఎ - అధ్యక్షులు గొలుగూరి బాపిరాజు, కార్యదర్శి ఎం కె. ప్రసాద్, రాజమహేంద్రవరం డివిజన్ యూనిట్ అధ్యక్షులు సురేష్ బాబు, పరిమళ, ఇతర రెవిన్యూ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 253 కేసులు రాజీ

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మూడు బెంచ్‌లు ఏర్పాటు చేయగా, మొదటి బెంచ్‌కు జి.చంద్రమౌళీశ్వరి (7వ అదనపు జిల్లా జడ్జి), ఏ.ప్రభూజీ అడ్వకేట్ మెంబర్లుగా, రెండవ బెంచ్‌కు డా.కె.దీప దైవకృప (సీనియర్ సివిల్‌జడ్జి) కె.ఎం.ఎల్.గణేష్ అడ్వకేట్ మెంబర్లుగా, మూడవ బెంచ్‌కు జి.హర్షవర్ధన్ (ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి), ఎం.రాంబాబు అడ్వకేట్ మెంబర్లుగా వ్యవహరించగా, ఈ జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 253 కేసులు రాజీ చేయడం జరిగినట్లు ఒక ప్రకటనలో భాగంగా తెలిపారు.

'ఆదిత్య'లో ఘనంగా జాతీయ గణాంక శాస్త్ర దినోత్సవం

కాకినాడ, మేజర్ న్యూస్ : స్థానిక సాంబమూర్తి నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో గణాంక శాస్త్ర దినోత్సవ సందర్భంగా గణాంక శాస్త్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు ఆదిత్య మహిళ డిగ్రీ కళశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలియజేశారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికి తీయుటకు వివిధ పోటీలు నిర్వహించారు. ప్రతీ సంవత్సరం జూన్ 29వ తేదీన భారత గణాంకశాస్త్ర దినోత్సం జరుపబడుతుందనీ, భారతదేశ ప్రఖ్యాత గణాంక శాస్త్రవేత్త ఆయన పి.సి.మహాలనోబిస్ పుట్టినరోజు సందర్భంగా గణాంక శాస్త్ర దినోత్సవం జరుపుకుంటున్నామనీ "ఫాదర్ ఆఫ్ స్టాటిస్టిక్స్"గాఆయనను పిలవడం జరుగుతుందని తెలియజేసారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన బి.శ్రీనువాసురావు, సినియర్ స్టాటికల్ ఆఫిసర్, కాకినాడ మాట్లాడుతూ ప్రొఫెసర్ ప్రశాంత చంద్ర మహాలనోబిస్ గురించి వివరించారు. గణాంక శాస్త్రన్ని రీసెర్చిలో ఉపయోగించే తీరును, పరిశోదనలో డేటా సేకరణ, విశ్లేషణ మొదలగు పద్దతులను గురించి వివరించారు. గెస్ట్ ఆఫ్ ఆనర్‌గా విచ్చేసిన యమ్. దుర్గారావు జూనియర్ స్టాటికల్ ఆఫీసర్, కాకినాడ మాట్లాడుతూ విద్యార్థులు ఆసక్తిగాచదువుతుంటూఎన్నోన్నోఅవకాశాలు అందిపుచ్చుకోవచ్చున్నారు. ప్రముఖ వ్యక్తులజీవిత చరిత్రను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. ఆదిత్య డిగ్రీ & పి.జి కళాశాల డైరెక్టర్ డా॥ బి.యి.వి.ఎల్ నాయుడు మాట్లాడుతూ నేటి విద్యార్థులు డిగ్రీ తర్వాత విశ్వ విద్యాలయాల్లో గణాంక శాస్త్ర విభాగంలో అధ్యాయనం చేయడం వలన పెద్ద సంఖ్యలో అవకాశాలు వస్తాయని వివరించారు.

మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధకులుగా తయారు కావాలని, నూతనఅవిష్కరణలు దిశగా యువత పయనించాలని తెలియజేసారు.ఈ సందర్భంగా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథి చేతులు మీదుగా జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి.నాగశ్రీకాంత్, గణాంక శాస్త్ర శాఖాధిపతి పి.రాజరాజేశ్వరి అధ్యాపకులు జి.సాయి నాగదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయ నాయకులారా... మా పొట్ట కొట్టొద్దు

- రెల్లి బ్రతుకులతో రాజకీయ చెలగాటం వద్దు
- పిఠాపురం మున్సిపాలిటీ ఆప్కాస్ ఉద్యోగుల ఆవేదన

పిఠాపురం, మేజర్ న్యూస్ : రాజకీయ నాయకులారా మా పొట్ట కొట్టొద్దని, పారిశుద్ధ్య కార్మికులైన మా రెల్లి బ్రతుకులతో రాజకీయ చెలగాటం ఆడవద్దని ఆప్కాస్ ఉద్యోగులు రాజకీయ నాయకులను వేడుకుంటున్నారు. శనివారం పిఠాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ... ఇటీవల కాలంలో పిఠాపురం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో 7 ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలు సక్రమంగా అధికారబద్ధంగా, న్యాయబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా జరిగాయని, కానీ కొంతమంది కౌన్సిలర్లు ఒక్కొక్కరి దగ్గర లక్షల్లో డబ్బులు డిమాండ్ చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అడిగిన లంచం ఇవ్వకపోవడంతో... చట్టబద్ధంగా నియామకాలు జరిగిన ఉద్యోగులకు వర్క్ ఆర్డరు ఇవ్వకుండా రాజకీయం చేయడం పై బాధిత రెల్లి కులస్థుల తీవ్ర మనోవేదనకు గురి అవుతున్నారు. గత ఎలక్షన్ లో పవన్ కళ్యాణ్ రెల్లి కులస్థులందరూ గట్టిగా మద్దతు తెలిపినందుకు వారి నియామకాలతో కొంతమంది కౌన్సిలర్లు చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తమకు న్యాయం చేయాలని అధికారులను వేడుకుంటున్నారు, న్యాయం జరగలేని పక్షంలో మున్సిపల్ కార్యాలయం వద్ద తమ కులస్థులు ధర్నాకు దిగుతామని అన్నారు.

జిల్లాలో పర్యటక పరంగా అభివృద్ధి కోసం సమగ్ర కార్యాచరణ సిద్ధం చెయ్యాలి

- కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : పర్యటకపరంగా అవకాశం ఉన్న ప్రాజెక్టుల పై సమగ్ర నివేదిక అందచేయాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలియచేశారు. శనివారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో జాయింట్ కలెక్టర్ ఎన్ తేజ్ భరత్‌తో కలిసి పర్యటన రంగం ప్రభావితం అంశాలు పై సమీక్ష నిర్వహించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, జిల్లాలో కడియం నర్సరీలకు ప్రత్యేక స్థానం కలిగి ఉందని పిపిపి విధానంలో పర్యటక రంగాన్ని అభివృద్ధి చేసే అవకాశం ఉన్న ప్రాజెక్టుల పై అధ్యయనం చేసి, సమగ్ర నివేదిక అందచేయాలని పేర్కొన్నారు. జిల్లాలో సుదీర్ఘ గోదావరి గట్టు ఉందని, ఆయా ప్రాంతాల్లో పర్యటక పరంగా బోటింగ్, సహస క్రీడలు, ఇతర అనుబంధ ఉల్లాసం కలిగించే అవకాశం ఉన్న ప్రాజెక్టులపై పిపిపి విధానంలో ప్రతి పదనలు రూపొందించి నివేదిక అందచేయాలని ఆదేశించారు. జిల్లాలో కడియం నర్సరీలకు ఉన్న ప్రాధాన్యత, పర్యటక పరంగా వున్న గుర్తింపు ను మరింత ముందుకు తీసుకుని వెళ్ళడం పై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉందన్నారు. కాటేజ్, కాన్ఫరెన్స్, బోటింగ్, మెడికల్, వెల్ నెస్, క్రీడలు, అమ్యూజ్ మెంట్ పార్కు, టీ/ కాఫీ పాయింట్స్ తదితర ప్రత్యేక గుర్తింపు కలిగిన వాతావరణం కలుగ చేస్తే రెండూ మూడు రోజుల పాటు పర్యాటకులు వొచ్చే అవకాశం ఉందని తెలిపారు. వివిధ నర్సరీలను అనుసంధానం చేస్తూ పర్యాటకులు ఒక మధురానుభూతి పొందేలా ఆయా నర్సరీల యాజమాన్యంతో సంప్రదించి, సానూకులత పరిస్థితులు కల్పన చేపట్టాలన్నారు. గోదావరీ రివర్ బెడ్ మీద సహస, మనో ఉత్సాహం కలుగ చేసే క్రిడాంశల, పిల్లలను ఆకట్టుకునే రీతిలో ఏర్పాట్లు చెయ్యాల్సి ఉంటుందన్నారు. బోటింగ్, సహస క్రీడలు, ఆహ్లాద పరిస్థితులు పర్యాటకులకు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఇకో టూరిజం ఏర్పాట్లు చేసేందుకు అనువైన ప్రాంతాలు గుర్తించాలని సూచించారు. ఇతర ప్రాంతాల్లో పర్యటించి ఆయా ప్రతిపాదిత పర్యటన అంశాలపై ప్రాజెక్ట్స్ నిర్వహిస్తున్న ఏజెన్సీలతో ప్రాజెక్టు రిపోర్టు అందజేయాలన్నారు. నగరంలో మంజీరా, రివర్ బేలు ఎపి పర్యటక శాఖ సమన్వయంతో పీపీపీ విధానంలో నిర్వహిసున్నట్లు పర్యటక శాఖ ఆర్ డివి.స్వామీ నాయుడు తెలిపారు. పద్మావతీ, పుష్కర్, సరస్వతీ ఘాట్‌లలో బోటింగ్ పాయింట్స్ ఉన్నట్లు తెలియచేశారు. హెవలాక్ వంతెన మీద ఫుడ్ కోర్టు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎన్ తేజ్ భరత్, టూరిజం ఆర్ డి వి.స్వామీ నాయుడు, జిల్లా టూరిజం అధికారి పి.వెంకటచలం, సహాయ మేనేజర్ పి. వెంకట చలం, బోటింగ్ సహాయ మేనేజర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ అధికారులు విధులకు సక్రమంగా హాజరయ్యేటట్టు చర్యలు తీసుకోవాలి

- ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్

రంపచోడవరం, మేజర్ న్యూస్ : ఏజెన్సీ ప్రాంతంలో సమస్యలపై దరఖాస్తులు ఇవ్వడానికి ప్రభుత్వ కార్యాలయాలకు వెడితే అధికారులు అందుబాటులో ఉండడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. దరఖాస్తులు ఇవ్వడానికి ప్రభుత్వ కార్యాలయాలకు వెళితే ప్రభుత్వ అధికారులు అందుబాటులో ఉండటం లేదని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గం పరిధిలోని దేవీపట్నం మండలంలో మండల ప్రజా పరిషత్ (ఎంపీడీవో) కార్యాలయానికి, ఇందుకూరుపేటలో ఉన్న తహాసిల్దార్ కార్యాలయానికి, ఇందుకూరు గ్రామంలో ఉన్న గ్రామ సచివాలయానికి సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తులు ఇవ్వడానికి ఆదివాసీ జేఏసీ బృందం వెళ్తే దేవీపట్నం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో క్రింది స్థాయి అధికారులు అందుబాటులో లేరన్నారు. అలాగే ఇందుకూరు గ్రామంలో ఉన్న గ్రామ సచివాలయానికి వెళ్తే పంచాయతీ సెక్రటరీ, గ్రేడ్ 5 సెక్రటరీ, పంచాయతీ సెక్రటరీ ఇన్చార్జి ఈవోపీఆర్టి అందుబాటులో లేరన్నారు. అలాగే దేవీపట్నం తాహాసిల్దార్ కార్యాలయానికి వెళ్తే డిప్యూటీ తాసిల్దార్ అందుబాటులో ఉండడంతో దరఖాస్తు సమర్పించమన్నారు. ఆయా శాఖల అధికారులు అందుబాటులో లేకపోవడంతోపాటు ఫోన్ చేసినా స్పందించడం లేదన్నారు. దీంతో కిందిస్థాయి అధికారులకు, సిబ్బందికి దరఖాస్తులు సమర్పించడం జరిగిందన్నారు. ప్రభుత్వ అధికారులు కార్యాలయాల్లో అందుబాటులో లేకపోవడంతో సామాన్య ప్రజలు వారి సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. కావున తక్షణమే జిల్లా కలెక్టర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రభుత్వ అధికారులు విధులకు సక్రమంగా హాజరయ్యేటట్టు చర్యలు తీసుకోవాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ రాష్ట్ర జేఏసీ కార్యదర్శి కారం రామన్న దొర, ఆదివాసీ జేఏసీ జిల్లా నాయకులు యలగాడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే నల్లమిల్లి

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : శనివారం స్థానిక జిల్లా కలెక్టర్ ఛాంబర్ అనపర్తి అసెంబ్లీ నియోజక వర్గ శాసన సభ్యులు నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియచేసి, పూల బొకే అందచేయ్యడం జరిగింది. ఈ సందర్భంగా అనపర్తి నియోజక వర్గ పరిధిలో చేపట్టవలసి ఉన్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టరుతో చర్చించడం జరిగింది.

కలెక్టరేట్‌లో ఘనంగా 18వ గణాంక దినోత్సవ వేడుకలు

- సిపివో ఎల్ అప్పలకొండ

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : భారతీయ శాస్త్రవేత్త మరియు గణాంకవేత్త. మహలనోబిస్ జన్మదినాన్ని గణాంక దినోత్సవ వేడుకలు ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లు జాయింగ్ డైరెక్టర్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఎల్ అప్పల కొండ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో 18 వ గణాంక దినోత్సవ వేడుకలనిర్వహించారు. ఈ సందర్భంగా అప్పల కొండ మాట్లాడుతూ, భారతదేశం యొక్క మొదటి ప్రణాళికా సంఘం సభ్యులలో ఒకరిగా ఉన్న మహలనోబిస్ చేసిన కృషికి గుర్తింపుగా ఆయన జన్మదినాన్ని గణాంక దినోత్సవంగా జరుపు కుంటున్నట్లు తెలియ చేశారు. ఆమేరకు మహలనోబిస్ భారతదేశంలో గణాంకాల పితామహుడిగా పరిగణించడం జరిగిందని తెలిపారు. ఆయన భారత దేశంలో ఆంత్రోపోమెట్రీలో మార్గదర్శక అధ్యయనాలు చెయ్యడమే కాకుండా, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్స్టిట్యూట్ని స్థాపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు ఏ..ముఖ లింగం, జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్లానింగ్ డిపార్ట్మెంట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జైళ్ళలో ఖైదీల భద్రత, పరివర్తన ముఖ్యం

- సూపరింటిండెంట్ ఎస్.రాహుల్

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :ఖైదీల భద్రత, పరివర్తనకే జైళ్ళ ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాయని రాజమండ్రి కేంద్ర కారాగార సూపరింటిండెంట్ ఎస్. రాహుల్ పేర్కొన్నారు. జైల్లో ఖైదీల అందరికీ నేత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైతే శస్త్ర చికిత్సలు చేసే వైద్య శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. పలువురు వృద్ధ ఖైదీలకు పరీక్షలు అనంతరము స్వయంగా కళ్ళజోళ్ళు తొడిగి, వాటిని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ రాహుల్ మాట్లాడుతూ జైల్లో అందిస్తున్న పలు రకాల సేవలను ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జైళ్ల శాఖ అందిస్తున్న శిక్షణను ఉపయోగించుకుంటూ మానసిక పరివర్తన చెంది విడుదల అయిన తర్వాత కుటుంబానికి, సమాజానికి ఉపయోగపడాలని కోరారు. ఖైదీలు కంటిచూపు పట్ల తగు శ్రద్ధ వహించాలన్నారు. కంటి చూపు జీవితానికి చుక్కాని లాంటిది అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సూపరింటెండెంట్లు ఎం రాజకుమార్, బి రత్న రాజు మాట్లాడుతూ ఐదు వారాలపాటు ప్రతి శనివారం ఈ నేత్ర శిబిరాన్ని నిర్వహించి, పరీక్షలు చేసి అవసరం మేర మందులు ఇవ్వడం, శస్త్ర చికిత్సలు చేయించడం, కళ్ళజోళ్ళు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం ఆధ్వర్యంలో నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ ప్రణీత్, కోఆర్డినేటర్ ఎన్. చంటిబాబు ఆధ్వర్యంలో సిబ్బంది వైద్య పరీక్షలు చేయగా, ఆమెన్ ట్రస్ట్ చైర్మన్ ఇవాంజిలిన్, అశోక్ అవసరమైన ఖైదీలకు కళ్ళజోళ్ళు బహూకరించారు.ఈ కార్యక్రమంలో జైలర్లు ఆర్. శ్రీనివాసరావు . కెవి. రామారావు, డాక్టర్ కోమల, సోషల్ ఇంక్యుబేషన్ సభ్యులు చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పవన్ విజయోత్సవ సభను విజయవంతం చేయండి...

- పవన్ విజయానికి సహకరించిన దళిత సోదరులకు ధన్యవాదాలు
- అలుపెరగని నిత్య శ్రామికుడు మన నాయకుడు పవన్ కళ్యాణ్
- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు, జనసేన నాయకులు బి.ఎన్.రాజు

పిఠాపురం, మేజర్ న్యూస్ : పిఠాపురం పట్టణం బంగారమ్మ రావి చెట్టు సెంటర్లో జూలై 1 అనగా సోమవారం నాడు జరిగే జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వారాహి విజయోత్సవ సభను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు, పిఠాపురం నియోజకవర్గం జనసేన నాయకులు బి. ఎన్. రాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బి.యన్ రాజు మాట్లాడుతూ... పవన్ కళ్యాణ్ విజయంలో సహకరించిన పిఠాపురం నియోజకవర్గ దళిత సామాజిక వర్గానికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నామని అన్నారు. అలుపెరగని నాయకుడు, నిత్య నిరంతర పోరాట యోధుడు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అని అన్నారు. జనసేన పార్టీ స్థాపించినప్పటి నుంచి ఎన్నో అవమానాలను భరించి, విమర్శలను తిప్పుకొట్టి, జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ 100% స్ట్రైక్ రేటుతో అత్యధిక భారీ మెజార్టీలతో ఘనం విజయం సాధించి దేశ చరిత్రలో ఎదురులేని తిరుగులేని నాయకుడిగా పవన్ కళ్యాణ్ ఉద్భవించారని అన్నారు. పిఠాపురం నియోజవర్గం నుండి పవన్ కళ్యాణ్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామని అన్నారు. భావితరాల భవిష్యత్తు నాయకుడు జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అని అన్నారు. సీఎం చంద్రబాబు పాలనలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనలతో ఆంధ్ర రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందని, గత ప్రభుత్వ పాలనలో నిర్వీర్యానికి గురైన వ్యవస్థలు ఇప్పుడిప్పుడే గాడిన పడి ప్రజలకు మెరుగైన సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్క యువత పవన్ కళ్యాణ్ ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. పవన్ కళ్యాణ్ విజయం కోసం ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి, అహర్నిశలు పాటుపడిన పిఠాపురం నియోజకవర్గ జనసేన ముఖ్య నాయకులు, జనసేన ప్రధాన కార్యదర్శి మెగా బ్రదర్ నాగబాబుకు, సీనియర్ జనసేన నాయకులు వేములపాటి అజయ్, కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్, పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ మరియు ఇతర ముఖ్య నాయకులు అందరి అడుగుజాడల్లో పనిచేసి పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ఏం చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని అన్నారు. పవన్ కళ్యాణ్ విజయంలో సహకరించిన ప్రతి ఒక్క దళిత బిడ్డకు మరొకసారి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నామని, సోమవారం నాడు పిఠాపురం నియోజవర్గంలో అత్యంత వైభవంగా జరిగే పవన్ కళ్యాణ్ విజయోత్సవ ర్యాలీ మరియు బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

త్రాగునీటి వాటర్ ట్యాంకులను పరిశీలించిన డీపీవో

పి.గన్నవరం,మేజర్‌న్యూస్: పి.గన్నవరం మండలం, బెల్లంపూడి గ్రామంలో శనివారం డీపీవో డి.రాంబాబు ,గ్రామ సర్పంచ్ బండి మహాలక్ష్మీతో కలిసి గ్రామంలో ఓహెచ్ఆర్ (రక్షిత మంచినీటి)ట్యాంకులను,చుట్టూ ఉన్న పరిసరాలను పరిశీలించి,సంతృప్తి వ్యక్తం చేశారు. క్లోరినేషన్ చేస్తున్న విధానాన్ని గురించి సిబ్బందిని అడిగి, కొన్ని సూచనలు చేశారు.నీటి ట్యాంకులు శుభ్రత,పరిసర ప్రాంతాలలో చెత్తా చెదారం లేకుండా ఉండాలని, శానిటేషన్ ప్రస్తుతం చేస్తున్నట్టుగానే నిరంతరం కొనసాగించాలని పంచాయితీ కార్యదర్శికి,సిబ్బందికి సూచించారు.

ప్రతి నెల తప్పనిసరిగా ఇప్పుడు చేస్తున్నట్లే ట్యాంకులను శుభ్రం చేయించాలని,నీటి నాణ్యత పరీక్షలను కూడా నిరంతరం నిర్వహించాలని సూచించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య బృందం చేస్తున్న ఫీవర్ సర్వే ను,వైద్య సేవల గురించి హెల్త్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలను ప్రజందరూ వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండి మహాలక్ష్మీ, బండి రమేష్, ఈవోపీఆర్డి ఉమా మహేశ్వర రావు,సీసీ సత్యనారాయణ ,పంచాయితీ కార్యదర్శి వి. రాణీ,ఇంజినీరింగ్ అసిస్టంట్ డి.పద్మ ,హెల్త్ మరియు పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యం, గంజాయి నియంత్రణపై పటిష్ఠ చర్యలు

- సెబ్ అధికారులకు జిల్లా కలెక్టర్ హితవు

ఏలూరు,మేజర్ న్యూస్: జిల్లాలో నాటుసారా, గంజాయి నియ ంత్రణపై పూర్తిస్థాయిలో నిఘావుంచి అటువంటి చర్యలకు పాల్పడే వారిని నియంత్రించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి సెబ్ అధికారులకు సూచించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో సెబ్ జాయింట్ డైరెక్టర్ యన్. సూర్యచంద్రరావు, వారి సిబ్బంది, జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్విని మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రి సెల్వి మాట్లాడుతూ నాటుసారా, అక్రమ మద్యం, గంజాయి సరఫరా, వినియోగించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయనే విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేసి అటువంటి చర్యలకు పాల్పడే వారిని నియంత్రించాలని సూచించారు.

అధికారులు చిత్తశుద్ధితో పని చెయ్యాలి

- గ్రామాల్లో ఎమ్మెల్యే చింతమనేని సుడిగాలి పర్యటన

పెదవేగి,మేజర్‌న్యూస్: దెందులూరు నియోజకవర్గ పరిధిలోని అనేక గ్రామాల్లో ఎంతోకాలంగా పారిశుధ్యం,నీటిసరఫరా,రోడ్ల మరమ్మత్తులు సహా అనేక సమస్యలు పెండింగ్ లో ఉండి పోయాయని వాటిపై చర్యలు చేపట్టాలని ఇటీవల సంబంధిత అధికారులకు సూచించిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్.గత 5ఏళ్లుగా అవినీతి ప్రభుత్వంలో చేసిన అధికారులు సిబ్బందికి ప్రజల సమస్యలు పట్టించుకోక పోవడం అలవాటుగా మారిందని, కానీ ఇది కూటమి ప్రభుత్వం అనేది ప్రజల ప్రభుత్వం అని, ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించేలా సత్వరమే చర్యలు తీసుకోకపోతే అటువంటి అధికారులను ఉపేక్షించం అని ప్రభాకర్ హెచ్చరించారు.